## 1

# కలవరపడిన హృదయాలకు సుగంధతైలం

## (యోహాను 14)

*"మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" (1–3 వచనాలు).*

యేసు అపొస్తలులను విడచి వెళ్తానని వారికి తెలియజేశాడు. "నేను తండ్రియొద్దకు వెళ్ళుచున్నాను" అని వివరించాడు (14:12 చూడుము). ఈ వార్త వారికి భయముతో కూడిన ఆందోళనను కల్గించింది. ఆయన భూమిమీద ఉండుటను వారు నమ్మారు. ఆయనలో, వారు నమ్మకముగా ఉన్నారు; ఆయన లేకుండా, వారికేమీయు తోచదు. నిశ్శబ్దం తొలగిన కొద్దిసేపటికి, సీమోను పేతురు అయనను యిలా అడిగాడు. "ప్రభువా, నీవెక్కడికి వెళ్ళుచున్నావని అడుగగా యేసు – నేను వెళ్ళుచున్నచోటికి నీవిప్పుడు నా వెంట రాలేవు గాని, తరువాత వచ్చెదవని అతనితో చెప్పెను" (13:36). ఆయన మాటలు అర్థము చేసుకోలేక, "పేతురు, ప్రభువా, నేనెందుకు ఇప్పుడు నీవెంట రాలేను? నీ కొరకు నా ప్రాణము పెట్టుదునని" చెప్పగా, ప్రత్యుత్తరంగా యేసు, "లేదు" నీవు నావెంట రాలేవని చెప్పెను. "ఈ రాత్రి నీవు నన్నెరుగనని చెప్పెదువనెను."

యేసు మాటలు అపొస్తలుల హృదయములను నలగగొట్టు నంత బలముగా ఉండెను. ఈ సంభాషణంతటి ద్వారా పేతురు మరియు యూదాకు ముందుగా జరుగబోవు విషయము చెప్పెను (13:21–38 చూడుము), అపొస్తలులు వాస్తవమును తెలుసుకొనుటలో వారిని భయము మరియు భ్రమయు నలగగొట్టి తారుమారు చేసినవి. వారిలో ఒకడు యేసును అప్పగించునను మాటకు, యేసు తన తండ్రియొద్దకు వెళ్ళుచున్నాననే మాటకు, మరియు అపొస్తలులలో నిష్కపటముగా మాట్లాడే వారిలో ఒకడైన పేతురు తనను ఎరుగనను అని ముందుగా యేసు సూచించి నందుకు వారి ఆత్మలు కంపించెను.

ఆ రాత్రి వారి హృయములలో చీకటి ప్రవేశించెను. వారికి ఆభయమిచ్చే కాంతి అవసరమైనది. కలవరపడిన వారి ఆత్మలను యేసు ఎలా నిమ్మళపరచాడు? అది వారికిచ్చాడని మనము నమ్మాలి. ఆయన మనకు కూడ దానిని ఇస్తాడు.

### అవలంబించుటకైన విశ్వాసము

*అవలంబించుటకైన విశ్వాసమును ఆయన వారికి యిచ్చాడు.* దేవునియందును మరియు నాయందును విశ్వాసముంచమని ఆయన వారికి చెప్పాడు. ఆయన వారికి రెండు ఆజ్ఞలను ఇచ్చాడు: *"దేవునియందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి"* (14:1; నొక్కి చెప్పింది నాది). వారు అనుమానించే సమయం అది కాదు: వారు నమ్మే సమయమది.

వారు పూర్తిగా అర్థము చేసుకొనకపోయుండవచ్చు; కాని, వారికి తెలిసిన దేవునియందు మరియు యేసునందు, వారు విశ్వాసం ఉంచగలరు. వెనుకకు చూస్తే వారు ఒక్క సారికూడా నిరుత్సాహపరచబడిన సమయం వారికి లేదు. వారికి ఏమి వాగ్దానము చేయబడెనో అది నెరవేరెను. దేవుడు మరియు క్రీస్తు వారిని నడిపించి గతంలో వారికి అన్ని అనుగ్రహించారు మరియు భయం కల్గించెడి సంఘటన గుండా వారు వెళ్ళితే, అలాగే విశ్వాసం ఉంచేలా వారు నడిపింపబడుతుంటారు.

ఎప్పుడు చీకటి రాత్రుల నీడలు మన చుట్టూ కమ్మునో – జవాబులు కొంచమైయుండునో మరియు మన కళ్లలోని కన్నీళ్లచే భవిష్యత్ అస్పష్టంగా ఉండునో, అప్పుడు మనము విశ్వాసం ఉంచాలి. మనలను ప్రతిఘటించు మరు భూమిలో దేవుడు మార్గములను కనుగొనగలడా; యేసుని మనం హత్తుకొనియుంటే ఆయన మనలను హత్తుకొనును.

## ఎదురుచూడగల భవిష్యత్తు

*పరలోక నగరిలో నివసించుటకు ఎదురుచూడాలని ఆయన వారికి చెప్పాడు.* విశ్వాసికి ఉండే అందమైన భవిష్యత్తును ఆయన సూచించాడు. “నా తండ్రి యింట అనేక నివాసములు కలవు లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరలా వచ్చి నాయొద్ద ఉండుటకు మిమ్మును తీసికొనిపోదును” (14:2, 3ఎ) అని యేసు చెప్పాడు. మనము ఉండుటకు చాలా నివాసములు సిద్ధపరచుటకు తన తండ్రి యింటికి యేసు వెళ్ళాడు. మనందరికి నివాసములు ఉన్నాయని ఆయన తిరిగి అభయమిచ్చాడు. అపొస్తలులు సకాలంలో, ఆయనను అనుసరిస్తారు, మరియు వారిలో ప్రతి ఒక్కరికి చాలా స్థలమున్నదని చెప్పాడు.

ఈ లోకము మనకు శాశ్వాతమైన నివాస స్థలము కాదని కష్టసమయములలో మనకు గుర్తు చేయబడుతుంది. మనము యాత్రికులము, కొంతకాలము ఉండి తరువాత వెళ్ళిపోయే పనివారివంటి వారము. “మనము ఈ లోక పౌరులమై పరలోకము వెళ్ళుటకు ప్రయత్నించువారము కాదు,” కాని మనము పరలోక పౌరులము ఈ లోకముగుండా వెళ్ళుటకు ప్రయత్నిస్తున్నాము అని చెప్పబడ్డాము. శాశ్వతమైన నివాసం ఉన్నదన్న ప్రతిబింబం విశ్వాసం ద్వారా మన మనస్సుల్లో నాటబడకపోవుటవలన ఈ లోక సంబంధమైన దుఃఖములను, శత్రువులను ఎదిరించలేకపోతున్నాము.

## ఎదురుచూడగల సహవాసం

*ఎదురుచూచుటకు యేసు సహవాసమునిచ్చాడు.* రానైయున్న పునః కలయికయందు ఉత్సహించండను యేసు చెప్పాడు. వారి ఎడబాటు శాశ్వతం కాదని ఆయన తన అపొస్తలులకు జ్ఞాపకం చేశాడు. ఆయన ఎక్కడికి వెళ్ళుతున్నాడో అక్కడికి ఆయన వారిని తీసుకొని వెళ్ళతాడు, అప్పుడు ఆయన ఎక్కడ ఉండునో, వారు కూడా అక్కడ ఉంటారు.

పరలోకములో ఉండే సహవాసమును జ్ఞాపకం చేసుకొన్నప్పుడు పరలోకపు నిరీక్షణ యింకా ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. మనం ఒక స్థలమునకు వెళ్ళుట లేదు; మనం తిరిగి కలుసుకొనవెళ్ళుతున్నాము. పునస్సమాగం యొక్క విలువ అది ఎక్కడ సంభవిస్తుందో

దానిని బట్టీ కాక, అక్కడ ఎవరు కలుసుకుంటారో దానిని బట్టి ఉంటుంది. మన మనస్సు గ్రహింపలేనంత అందముగలది పరలోకము; అక్కడ అనుభవించే సహవాసము దాని సౌందర్యాన్ని రెండింతలు మరియు యింకారెండింతలు చేస్తుంది. యోహాను ఈలాగు వ్రాశాడు,

> అప్పుడు – ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడైయుండును. ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని (ప్రకటన 21:3, 4).

మీరు దేవునికి చాలా సన్నిహితముగా ఉంటే ఆయన మీ కన్నులనుండి కారే బాష్పబిందువులను తుడిచివేయునని మీరు ఊహించగలరా?

## ముగింపు

చీకటి దినములున్నప్పుడు మరియు మన హృదయములు అలసిపోయి మరియు కలవరపెట్టబడినప్పుడు, మన ఆత్మలు యాచించు ప్రోత్సాహము కొరకు మనము ఎక్కడికి వెళ్ళగలం? యేసు ఆయనయొద్దకు రమ్మని మనలను ఆహ్వానిస్తున్నాడు, "మీ హృదయములు కలవరపడనియ్యకుడని" చెప్పుచున్నాడు. ఆయన నమ్మకత్వం యెడల విశ్వాసముంచమని, రక్షింపబడినవారు ఆయన యొద్ద భవిష్యత్తును ఎదురుచూడమని, మరియు రాబోవు ఆశ్చర్యకరమైన సహవాసములో ఆనందించమని కోరుతున్నాడు.

"గిలాదులో గుగ్గిలము ఏమియు లేదా? అక్కడ ఏ వైద్యుడును లేడా? నా జనులకు స్వస్థత ఎందుకు కలుగక పోవుచున్నది?" అని యిర్మీయా అడుగుచున్నాడు (యిర్మీయా 8:22). "కలవరపడిన హృదయములకు గుగ్గిలము లేదా? గాయపడిన ఆత్మను స్వస్థపరచగల వైద్యుడు లేడా? నిరాశనుండి, దుఃఖమునుండి దేవుని ప్రజలు ఎలాగు దూరం కాగలరు?" అని యిర్మీయా మాటలను కొంత మార్చి అడుగుదాం. ఈ ప్రశ్నలకు జవాబు గ్రహించవచ్చు; అది ఒక మాటలో ఉంది: "యేసు"! ఆయన మన గుగ్గిలం, మన గొప్పవైద్యుడు. ఆయన సమస్త నిరీక్షణను, విశ్రాంతిని, యాత్రికులకు కావలసి ప్రోత్సాహన్ని యిస్తాడు. ఆయన యందు మనకున్న విజయవంతమైన విశ్వాసం, ఆయన ద్వార మనకు ఉన్న నిత్య భవిష్యత్తు మరియు ఆయనతో మనకు ఉన్న మధురమైన సహవాసం: యివి మనలను జీవింపచేయును! యివన్నియూ మరియు పరలోకమును కూడా మనము కలిగియుందుము!

---

*"మార్గము లేకుండా, వెళ్ళడం ఉండదు; సత్యములేకుండ, తెలుసుకోవడం ఉండదు; జీవము లేకుండ, జీవించడం ఉండదు. నేనే మార్గమును, మీరు అనుసరించవలసిన మార్గము; అది మీరు నమ్మవలిసిన సత్యము; మీరు నిరీక్షించవలసిన జీవితం అదే.*

*"**నేనే** అతిక్రమింపకూడని మార్గము (ఎప్పటికి అవమానము పొందని), అమోఘమైన సత్యమును, అంతము లేని జీవితము."*

*"**నేనే** తిన్ననైన మార్గమును, పరమ శ్రేష్ఠమైన సత్యమును, వాస్తవమును, దీవించబడిన, సృజింపబడని*

*జీవమునైయున్నాను."*

*"మీరు నా మార్గమందు నిలిచియుంటే, మీరు సత్యమును తెలుసుకొందురు, సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయును, మరియు మీరు నిత్యజీవమునందు నిలిచియుందురు."*[1]

---

సూచన

[1]Thomos à Kempis, *Of the Imitation of Christ* (New Canaan, Conn.: Keats Publishing, 1982), 237-38.